రుణాలతో జేసీబీలు కొని..

## ఆఫ్రికన్ దేశాలకు తరలింపు

- లోన్లు ఎగవేసి.. ఫైనాన్స్ సంస్థలకు టోకరా
- సీసీఎస్‌లో మరో కేసు నమోదు

సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): బ్యాంకు రుణాలతో నిర్మాణ రంగంలో ఉపయోగించే వాహనాలు, యంత్రాలు కొనుగోలు చేసి.. వాటిని అక్రమ పద్ధతిలో ఇతర దేశాలకు తరలిస్తూ, రుణాలు ఎగవేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ మహేంద్ర అండ్ మహేంద్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ఇచ్చిన ఫిర్యాదుపై తాజాగా సీసీఎస్‌లో మరో కేసు నమోదయ్యింది. ఈ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కేంద్ర కార్యాలయం ముంబైలో ఉండగా.. సికింద్రాబాద్ కార్ఖానాలో బ్రాంచ్ కార్యాలయం ఉంది. మహబూబ్‌నగర్‌కు చెందిన బైరపోగు బాలప్ప రూ. 36.94 లక్షల రుణంతో జేసీబీ, నాగర్‌కర్నూల్‌కు చెందిన అడ్డాకుల సాయిలు రూ. 36.94 లక్షలు, రాముడు 36.94 లక్షలు, నల్గొండకు చెందిన కొంగల మౌనిక రూ. 57.87 లక్షల రుణాలతో జేసీబీ వాహనాలు తీసుకున్నారు. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించకపోవడంతో వాహనాల రికవరీ కోసం ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు ప్రయత్నించారు. వాహనాలు కనిపించకపోవడంతో ఆరా తీశారు. నిబంధనలకు విరుద్ధంగా నకిలీ డాక్యుమెంట్లతో సముద్ర మార్గాన వాటిని ఆఫ్రికన్ దేశాలకు తరలించి, సొమ్ము చేసుకున్నారని తేలింది. దీంతో ఆ సంస్థ లీగల్ మేనేజర్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేవలం జేసీబీలే కాకుండా నిర్మాణ రంగానికి సంబంధించిన ఇతర యంత్రాలకు కూడా రుణాలు పొంది.. ఈ విధంగానే వాటిని విదేశాలకు తరలించారని పోలీసులకు తెలిపారు. ఇప్పటికే ఇలాంటి మోసాలపై పలు కేసులు నమోదయ్యాయి. దేశ వ్యాప్తంగా ఉన్న నౌకాశ్రమాలకు గతంలో లేఖలు రాసి వివరాలు సేకరించారు. బ్యాంకు అధికారుల పాత్రపై కూడా పోలీసులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. రుణాలు తీసుకున్న లబ్ధిదారులకు అంత పెద్ద మొత్తంలో అప్పు తీసుకునే అర్హత ఉందా.? వంటి అంశాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు.

## సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌లో..

- నిధులు గోల్‌మాల్
- సభ్యుల ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు నమోదు

సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్ సభ్యులకు గృహసదుపాయం కల్పించడంలో భాగంగా బ్యాంకులలో జమచేసిన రూ.6.5 కోట్లు యూనియన్ కార్యవర్గం దుర్వినియోగం చేసిందంటూ సభ్యులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్‌లో 700 మంది సభ్యులు ఉన్నారు. సంఘానికి అధ్యక్షుడు సత్యనారాయణ దొర, ప్రధాన కార్యదర్శి కాట్రగడ్డ సుధాకర్, కోశాధికారి రాజేశ్ రాం బాలతో సహా 18 మంది యూనియన్ కార్యవర్గ సభ్యులు ఉన్నారు. యూనియన్ బ్యాంకు ఖాతా జూబ్లీహిల్స్‌లోని యూనియన్ బ్యాంకులో ఉండగా.. అందులో రూ. 6.5 కోట్లు డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా ఉన్నాయి. ఈ నిధులు సభ్యుల ఇంటి స్థలాలు కొనుగోలు చేసేందుకు దాచిపెట్టారు. అయితే, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి ఇతర కార్యవర్గ సభ్యులు కుట్ర పూరితంగా, నిబంధనలను భేఖాతారు చేస్తూ యూనియన్ ఖాతా నుంచి రూ. 6.5 కోట్లు ఇతర ఖాతాలకు బదిలీ చేశారు. ఆ డబ్బుల విషయంపై కార్యవర్గాన్ని నిలదీయడంతో తాళకొండపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసిన ఐదు డాక్యుమెంట్ల ద్వారా రాంపూర్‌లో 15.3 ఎకరాల పొలం కొనుగోలు చేశామని కార్యవర్గ సభ్యులు వెల్లడించారు. ఆ సేల్ డీడ్‌ల ప్రకారం వాటి విలువ రూ. 76,47,175 ఉన్నదని, ఎలాంటి అగ్రిమెంట్లు, డబ్బు చెల్లించిన రశీదులు చూపించలేదని, పక్కా ప్లాన్‌తో కుట్ర పూరితంగా నిధులన్నీ ఇతర ఖాతాలకు బదిలీ చేసుకొని గోల్‌మాల్ చేశారంటూ సభ్యులు రాందాస్ ధన్‌రాజ్, ఆర్.వెంకటేశ్వర్‌రావు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## డివైడర్‌ను ఢీకొట్టి..

**సివిల్స్‌కు సిద్ధమవుతున్న యువకుడి మృతి**

కవాడిగూడ, అక్టోబర్ 1: ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని సివిల్స్‌కు సిద్ధమవుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్ఐ కావ్య తెలిపిన వివరాల ప్రకారం.. కాకర్ల భానుచందర్ (24)కొద్ది రోజులుగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ.. అశోక్‌నగర్‌లోని లా ఎక్సలెన్స్‌లో సివిల్స్‌కు సిద్ధమవుతున్నాడు. ఆదివారం రాత్రి ఎస్‌బీఐ కాలనీలో ఉంటున్న తన స్నేహితుడైన సాయివికిత్ ఇంటికి వచ్చి విందులో పాల్గొన్నాడు. తిరిగి తన బుల్లెట్ వాహనంపై హాస్టల్‌కు వెళ్తూ.. ఫుట్‌పాత్‌ను ఢీకొట్టాడు. అదే వేగంతో ముందుకెళ్లి స్కూల్ జోన్ బోర్డునూ ఢీకొట్టాడు. దీంతో అతడికి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గాంధీనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. అతడి కుటుంబ సభ్యులకు కూడా సమాచారమిచ్చినట్లు ఎస్ఐ కావ్య తెలిపారు. ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్లడం, హెల్మెట్ లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. భానుచందర్ కుటుంబ సభ్యులు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్రశాంతంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

*సీసీ కెమెరాలతో పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీపీ సీవీ ఆనంద్*



సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): నగరంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు నిర్వహించిన ర్యాలీ ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఈ నెల 28న నిర్వహించాల్సిన ఈ ర్యాలీ, వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసుల విజ్ఞప్తి మేరకు అక్టోబర్ 1వ తేదీకి వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఆదివారం మిలాద్ ఉన్ నబీ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. వేలాది మంది యువకులు బైకులు, కార్లతో పాటు ప్రధాన కూడళ్లలో నడుచుకుంటూ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఈ ర్యాలీని సీసీ కెమెరాల ద్వారా బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతరం పరిశీలించారు. డ్రోన్ కెమెరాలతో ర్యాలీపై నిఘా పెట్టి పరిశీలించారు. ప్రధాన ర్యాలీ ఖాద్రీ చమన్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం చార్మినార్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ర్యాలీని సీపీ సీవీ ఆనంద్, అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్‌బాబు, అదనపు సీపీ (ఎస్బీ) విశ్వప్రసాద్, సౌత్‌జోన్ డీసీపీ సాయి చైతన్యతో కలిసి పరిశీలిస్తూ నిర్వాహకులను కలిశారు. ప్రధాన కూడళ్లలో సామాన్య ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారు.

## సమన్వయంతో ప్రశాంతత

- పోలీసుల సూచనలతో గొప్ప నిర్ణయాలు
- ఒకరినొకరు గౌరవించుకునే సంప్రదాయంతో పెరిగిన నగర ప్రతిష్ఠ
- హైదరాబాద్‌లో పటిష్టమైన శాంతి భద్రతలు
- మరోసారి నిరూపించిన సిటీ కాప్స్

సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): వినాయక నవరాత్రులు, నిమజ్జనంతో పాటు మిలాద్ ఉన్ నబీ పండుగలు హైదరాబాద్‌లో ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. 35 ఏండ్ల తర్వాత ఒకేరోజు నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ర్యాలీలు వచ్చాయి. ఒకేరోజు రెండు మతాలకు సంబంధించిన వేడుకలు నిర్వహించడంపై మొదట్లో కొంత ఆందోళన చెందారు. హైదరాబాద్‌లో ప్రశాంతమైన వాతావరణం ఉండాలని పోలీసులు అందరిని సమన్వయం చేశారు. ఇందులో భాగంగానే ముస్లిం మత పెద్దలతో చర్చించి, వాస్తవ పరిస్థితిని వివరించడంతో సెప్టెంబర్ 28వ తేదీ నుంచి తమ ర్యాలీని అక్టోబర్ 1వ తేదీకి వాయిదా వేస్తూ గొప్ప నిర్ణయం తీసుకున్నారు. దీంతో 28న గణేశ్ నిమజ్జనాన్ని భారీ బందోబస్తు మధ్య ప్రశాంతంగా నిర్వహించారు. ఈసారి విగ్రహాల సంఖ్య పెరగడంతో రెండు రోజుల పాటు నిమజ్జనం కొనసాగింది. దీంతో 48 గంటల పాటు పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.

### ఒకరికొకరు.. కలిసి మెలిసి

హైదరాబాద్ భిన్న సంస్కృతులకు నిలయం. భిన్న మతాలకు చెందిన వారు నివాసముంటారు. ఒకరి పండుగలను మరొకరు గౌరవించుకుంటూ.. నగర ప్రజలు కలిసి మెలిసి ఉంటారు. తెలంగాణ ఏర్పడిన తరువాత పోలీసులు కూడా ప్రజలతో కలిసిపోయి ఫ్రెండ్లీ పోలీసింగ్ చేస్తున్నారు. పటిష్టమైన శాంతి భద్రతల నిర్వహణతో ప్రజలకు మేమున్నామనే పూర్తి భరోసానిస్తున్నారు.

# అన్ని వ్యవస్థలకు రాజ్యాంగమే మార్గనిర్దేశం




సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ లావు నాగేశ్వర రావు

- రాజ్యాంగాన్ని విధ్వంసం చేసే హక్కు పార్లమెంట్‌కు లేదు
- జస్టిస్ లావు నాగేశ్వరరావు

చిక్కడపల్లి, అక్టోబర్ 1: అన్ని వ్యవస్థలకు రాజ్యాంగమే మార్గనిర్దేశం అని సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. రాజ్యాంగాన్ని విధ్వంసం చేసే హక్కు పార్లమెంట్‌కు లేదని ఆయన వివరించారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఏఐఎల్‌యూ)తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'రాజ్యాంగం- ప్రజలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు 'రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాలను పునః పరిశీలించే' అంశంపై మాట్లాడారు. దేశంలో రాజ్యాంగం పదువుల్లో ఉన్న వారంతా రాజ్యాంగానికి లోబడి పనిచేస్తేనే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీకి అలహాబాద్ హైకోర్టు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పును ఆయన ఉదాహరిస్తూ కేశవానంద భారతి కేసులోని అంశాలను గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థపైనే ఉంటుందని తెలిపారు. ఐలు ఆధ్వర్యంలో 'రాజ్యాంగం- ప్రజలు' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఐలు రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ఒడిశా హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఎన్.మురళీధర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి హైకోర్టు పూర్వ న్యాయమూర్తి టి. రజని, ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, జి.విద్యాసాగర్, న్యాయవాది ఎం.వి.దుర్గాప్రసాద్, ఐలు మహిళా కమిటీ కన్వీనర్, సీహెచ్. శైలజ, ఎన్. వెంకటేష్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగిన సుకున్ సంగీత కచేరిలో పాటలు పాడుతూ సంగీతంతో అలరించిన ప్రముఖ సూఫీ సింగర్ బిస్మిల్

– మాదాపూర్, అక్టోబర్ 1

## ద్విచక్రవాహనం అదుపుతప్పి..

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 1: ద్విచక్రవాహనం అదుపుతప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి కిందపడటంతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ వి.అశోక్ రెడ్డి కథనం ప్రకారం.. సంస్కృతి టౌన్‌షిప్‌లో నివాసముంటున్న ఇందారపు ఆదిత్య(20) ఘట్‌కేసర్ మండలంలోని దివ్యానగర్‌లో ఉన్న నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం ఆదిత్య మిత్రులు పవన్ కుమార్(20), అరవింద్(20) వచ్చి అర్ధరాత్రి వరకు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత పవన్ కుమార్ బైక్‌పై సంస్కృతి టౌన్‌షిప్ బయట ఉన్న సర్కిల్ వద్దకు చేరుకున్నారు. బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి కింద పడ్డారు. దీంతో వెనుక కూర్చున్న ఆదిత్య తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్ నడుపుతున్న పవన్ కుమార్ కూడా గాయపడ్డాడు. మధ్యలో కూర్చున్న అరవింద్ వీరిద్దరిని చికిత్స నిమిత్తం మేడిపల్లిలోని శ్రీకర దవాఖానకు తరలించాడు. పరీక్షించిన వైద్యులు ఆదిత్య అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. అతివేగం, అజాగ్రత్తగా బైక్ నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

## అమెరికాలో తెలుగు రుచులు

- 'మాట' దేశీ చెఫ్‌కు అనూహ్య స్పందన
- 300 మందికి పైగా హాజరు



మాట ఫౌండర్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గానగోని న్యాయ నిర్ణేతలుగా, శిరీషా సజ్జా వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): అమెరికాలో తెలుగు రుచులు అందరినీ 'ఆహా' అనిపించాయి. మన అమెరికా తెలుగు అసోసియేషన్ (మాట) ఆధ్వర్యంలో నిర్వహించిన దేశీ చెఫ్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం యునైటెడ్ స్టేట్స్‌లోని ఆల్ఫారెట్టా (జార్జియా)లో దేశానా మిడిల్ స్కూల్‌లో దేశీ చెఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమెరికాలోని తెలుగు కుటుంబాలకు చెందిన సుమారు 300 మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. తెలుగు వంటకాలు అందరినీ మెప్పించాయి. ఈ పోటీల్లో రేణుక దర్గం(మొదటి), మాధవి మున్నగి(ద్వితీయ), రమాదేవి, స్వరూప(తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. తొమ్మిదేండ్ల చిన్నారి సృష్టికి ప్రత్యేక బహుమతి అందజేశారు. మణి విక లపాటి, అనూష వక్క, టాలీవుడ్ సింగర్ కృష్ణ ప్రసాద్, మాట ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గూడూరు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిరణ్ దుద్దగితోపాటు సలహా మండలి సభ్యులు జితేందర్ రెడ్డి, ప్రదీప్ సామల, కోశాధికారి గంగాధర్ ఉప్పల, కో ఆర్డినేటర్ విజయభాస్కర్ కలాల్, సంయుక్త కార్యదర్శి టోనీ జన్ను, వెంకట్ సుంకిరెడ్డి, ఉపాధ్యక్షులు రాజ్ అందదేపు, శ్రీధర్ గూడాల, శ్రీనివాస్ తాటిపాముల, బోర్డు డైరెక్టర్ నగేష్ చిలకపాటి, వేణు టప్పా, మాధవి మున్నగి, శిరీషా రెడ్డి, శ్రావణి చంద్ర పర్యవేక్షించారు.